క్లుప్తంగా

ఘనంగా మొల్లమాంబ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: తొలి తెలుగు కవయిత్రి కుమ్మరి మొల్లమాంబ 585 జయంతిని జిల్లా కేంద్రంలోని కుమ్మరి సంఘ భవనంలో పట్టణ కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమ్మరి సంఘం పట్టణ అధ్యక్షుడు రామెల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ మొల్లమాంబను కుమ్మరి కులస్తులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొల్లమాంబ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. కుమ్మరుల ఐక్యత కోసం అందరూ పాటుపడాలని తీర్మానించారు. కార్యక్రమంలో నాయకులు కన్నం మోహన్ బాబు, నూటెంకి సత్యనారాయణ, కిష్టన్న, రాజేందర్, మల్లయ్య, విఠల్, మోహన్, అశోక్, సాయి, కన్నం శివకుమార్, రాజశేఖర్, దేవేందర్, శంకర్, గణేష్ పాల్గొన్నారు.

సహజ రంగులు వాడాలి



రంగులు తయారు చేస్తున్న ప్రిన్సిపాల్

ఇచ్చోడ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందుకు హోలీ సందర్భంగా సహజ రంగులు వినియోగించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో మొదుగ పూలతో సహజ రంగులను తయారు చేసి విద్యార్థులకు, అధ్యాపకులకు పంపిణీ చేశారు. సహజ రంగులు వాడటం వలన చర్మవ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సరస్వతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: ఉపాధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించి, ఉపాధి కూలీలతో మాట్లాడారు. రోజురోజుకూ ఎండలు మండుతున్నందున ఉదయం 6 గంటలకే పని ప్రదేశానికి కూలీలు రావాలన్నారు. కూలీల కోసం తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు.


ప్రశాంతంగా హోలీ జరుపుకోవాలి

ఇచ్చోడ: ప్రజలు ప్రశాంత వాతావరణంలో హోలీ పండుగ జరుపుకోవాలని ఇచ్చోడ సీఐ భీమేశ్ కోరారు. గురువారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పండుగ సందర్భంగా ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. సంప్రదాయ, సహజ సిద్ధమైన రంగులతో హోలీని జరుపుకోవాలని కోరారు. ముఖ్యంగా యువత చెరువులు, బావుల్లో స్నానాలు చేసేందుకు వెళ్లవద్దని సూచించారు.

పాఠశాల తనిఖీ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని జంబుల్‌ధరి టీడబ్ల్యూపీఎస్ పాఠశాలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రొడ్డ శైలజ, ఎస్‌సీఆర్‌పీ ఆత్రం మధూసూదన్‌లు గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో పాఠశాలకు వెళ్లగా అక్కడ పాఠశాలకు తాళం వేసి ఉన్నట్లు వారు గుర్తించారు. గ్రామస్తులతో వారు మాట్లాడగా ప్రతీ రోజు ఇదే పరిస్థితి ఉందని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా రెండు రోజులలో గ్రామస్తులు రాత పూర్వకంగా సంబంధిత అధికారులకు వినతిపత్రాలన్ని ఇవ్వనున్నమని గ్రామస్తులు తెలిపారు.

సెల్‌టవర్ నిర్మాణం నిలిపివేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న కాలనీవాసులు

కైలాస్‌నగర్: అక్రమంగా నిర్మిస్తున్న సెల్‌ఫోన్ టవర్ పనులను వెంటనే నిలిపివేయాలని ఆదిలాబాద్ పట్టణంలోని 12వ వార్డు న్యూహౌజింగ్‌బోర్డు పరిధిలోని జూబ్లీ హిల్స్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. గురువారం టవర్ నిర్మిస్తున్న ప్రాంతంలో ధర్నా చేపట్టారు. వీరి ఆందోళనకు యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు మద్దతు తెలిపారు. సెల్ టవర్ నిర్మాణంతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

హోలీ సంబురాలు

జిల్లాలోని ఆయా గ్రామాల్లో, పాఠశాలలు, కళాశాలల్లో హోలీ వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఒకరిపై ఒకరూ రంగులు చల్లుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే గ్రామ పెద్దల సమక్షంలో ఇంటింటికీ వెళ్లి కుడుకలు, చక్కెర బిల్లలు సేకరించి, గ్రామంలో కుటుంబాల లెక్క నిర్ధారించారు. వెదురు బొంగులు, మోదుగ పూలు, నైవేద్యం సమర్పించి గ్రామ పొలిమేరలో కాముడి దహనం చేశారు. బేలలో అనవాయితీగా దేశ్‌ముక్ వంశస్థులు డప్పు చప్పుళ్లతో శోభాయాత్ర నిర్వహించారు.

- సాక్షి, నెట్‌వర్క్



బోథ్: చిన్నారుల హోలీ సంబురాలు



ఇంద్రవెల్లి: చక్కెర హారాలు సేకరిస్తున్న ఆదివాసీలు



ఇచ్చోడ: ముఖరా(బి)లో..



ఉట్నూర్‌రూరల్: కుడుకలు సేకరిస్తున్న గ్రామపెద్దలు



సిరికొండ: కాముని దహనం చేస్తున్న గ్రామస్తులు



బేలలో కాముని దహనం చేస్తున్న యువత

ప్రతీ కుటుంబానికి పని కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రమేశ్

బోథ్: జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలన్నారు. తప్పులు లేకుండా హాజరు నమోదు చేయాలని సూచించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉదయాన్నే పనులకు వెళ్లేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్: ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రవిపై ఇష్టారీతిగా దుర్భాషలాడిన కాగజ్‌నగర్ ఎంపీడీవో రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర జూనియర్ అటవీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరేశ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

వృథాగా జిమ్ పరికరాలు



పట్టణ ప్రకృతివనంలో పడేసిన జిమ్ పరికరాలు

- బల్దియా అధికారుల నిర్వాకం
- కాలనీల్లో ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ అధికారుల నిర్వాకంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో రూ.10 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలను వృథాగా పడేయడంతో వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం యోగాసానాలు చేసేందుకు వీలుగా గత ప్రభుత్వం ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగానే పట్టణంలోని బొక్కల్‌గూడ కాలనీలో బల్దియా అధికారులు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. రూ.10 లక్షల వ్యయంతో పరికరాలను కొనుగోలు చేయడంతో పాటు మరో లక్ష రూపాయలను వెచ్చించి ప్లాట్‌ఫాం నిర్మాణం చేపట్టడంతో పాటు పరికరాలను బిగించారు. అయితే అదే స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టడంతో అక్కడ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను తొలగించివేశారు.

ప్రకృతివనంలో వృథాగా..

కసరత్తులు చేసేందుకు తోడ్పడే జిమ్ పరికరాలను కైలాస్‌నగర్‌లోని పట్టణ ప్రకృతివనానికి తరలించి పడేశారు. ఓపెన్ జిమ్‌ల్ లేనటువంటి కాలనీలలో ఏర్పాటు చేస్తే అక్కడి ప్రజలకు ఆరోగ్యపరంగా ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. పోనీ అదే కాలనీలో జిమ్‌ను ఏర్పాటు చేసినట్లెతై కాలనీవాసులు కసరత్తులు చేసేందుకు తోడ్పడే అవకాశముండేది. కానీ అలా చేయకుండా బల్దియా అధికారులు గతేడాది కాలంగా పరికరాలను ప్రకృతివనంలో పడేశారు. వాటిని ఇంకా అలాగే ఉంచితే చెడిపోయి ఎందుకు పనికిరాకుండా పోయే అవకాశముంది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం సదుద్దేశ్యంతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తే దాన్ని నిర్లక్ష్యంగా తొలగించడమే కాకుండా ఎవరికీ ఉపయోగపడకుండా జిమ్ పరికరాలను ఇలా చెత్తలాగా పడేయటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీన్ని గమనించిన కాలనీవాసులు ప్రజాధనమే కాదా తమదేం పోతుందనే భావనతోనే మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి వాటిని కాలనీలోనైన లేదంటే మరో ఇతర కాలనీలో బిగించే దిశగా తగు చర్యలు చేపట్టినట్లెతై ప్రజలు జిమ్ చేసేందుకు తోడ్పడుతుంది. దీనిపై బల్దియా ఇంజనీరింగ్ అధికారులను సంప్రదించగా త్వరలోనే జిమ్ పరికరాలను బిగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొనడం గమనార్హం.

'ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి అసెంబ్లీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి'



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: అసెంబ్లీ సమావేశంలో అభివృద్ధిపై జరుగుతున్న చర్చలో ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి దళిత సభపతిపై దురుసుగా ప్రవర్తించడం సరికాదని, వెంటనే ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి అసెంబ్లీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద ప్రధాన రహదారిపై కాంగ్రెస్ నాయకులతో కలిసి జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై, అసెంబ్లీ సభపతిపై అనుచిత వాఖ్యలు చేసిన ఎమ్మెల్యేను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ మసుద్, జహీర్, బాబారావ్, మానిక్‌రావ్, జునైద్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: అసెంబ్లీ సమావేశాల్లో అభివృద్ధిపై చర్చిస్తున్న సమయంలో దళిత స్పీకర్ మీద బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి దురుసు వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. గురువారం ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో జగదీశ్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖయ్యుం, బ్లాక్ అధ్యక్షుడు ఎక్బాల్, ఫ్యాక్స్ చైర్మన్ ప్రభాకార్‌రెడ్డి, దూట రాజేశ్వర్, జైంత్‌రావు, భూమన్న, అర్షద్, నిసార్, మహేందర్, సలావొద్దిన్ పాల్గొన్నారు.

నీరు విడుదల చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోథ్: సొనాల మండల కేంద్రంలో నీటి ఎద్దడి తీవ్రతరం కావడంతో చింతల్‌బోరి ప్రాజెక్టు నుంచి నీరు వాగులో విడుదల చేయాలని బుధవారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, గ్రామస్తులు తహసీల్దార్ మల్లేష్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు గ్రామస్తులు ప్రాజెక్టులో నీటి నిల్వను పరిశీలించారు. సొనాల వరకు నీరు వచ్చే విధంగా చూడాలన్నారు. సొనాల, చింతలబోరి ఫీడర్‌లకు పగలు, రాత్రి ఐదు రోజుల పాటు ఆపివేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, బండారి మురళీధర్, వసంత్ రావు, సూర్యపాటిల్, నడిపి గంగారం, భీంరావు పాటిల్, శివయ్య, అమృత్ రావ్ పాటిల్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

'యువ వికాసం' సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బోథ్: తెలంగాణ ప్రజా ప్రభుత్వం నిరుద్యోగ యువతీ, యువకుల కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ.. నిరుద్యోగులు వారి కాళ్ల మీద వారు నిలబడాలన్న ఉద్దేశంతో రాజీవ్ యువ వికాసం ద్వారా మూడు లక్షల నుంచి ఐదు లక్షల వరకు ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక సాయం అందించడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులు స్వీకరణ జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ అబూద్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బాధిత కుటుంబాలకు చేయూత

ఆదిలాబాద్‌టౌన్: బాధిత కుటుంబాలకు సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి చేయూత అందించారు. భోరజ్ మండల కేంద్రానికి చెందిన నిమ్మల అభిత అగ్ని ప్రమాదంలో గాయపడిన విషయాన్ని తెలుసుకొని గురువారం ఆమె నివాసానికి చేరుకొని పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం జైనథ్ మండలం కరంజి గ్రామానికి చెందిన విఠల్ అనారోగ్యంతో బాధపడుతున్నాడనే విషయాన్ని తెలుసుకొని ఆయనను సైతం పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం చేశారు.

ఎస్పీని కలిసిన నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: నూతన ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అఖిల్ మహాజన్‌ను పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్పీని కలిసిన వారిలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మావల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, నాయకులు వెంకట్ రెడ్డి, అట్ల గోవర్ధన్ రెడ్డి, నలిమెల నవీన్ రెడ్డి, కుదురుపాక సురేష్, కొరటి ప్రభాకర్, అలీమ్ ఖాన్, సమ్ము ఉన్నారు.

ప్రీఫైనల్ పరీక్ష వేళలు మార్చాలి

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 15న జరగనున్న సాంఘిక శాస్త్రం ప్రీఫైనల్ పరీక్ష వేళలను మార్చాలని సాంఘిక శాస్త్రం ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాములు, సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12.15 నుంచి 3.15 గంటల వరకు పరీక్ష జరగనుందని, ఈ సమయాన్ని ఉదయం 8.15 నుంచి 11.15 గంటల వరకు మార్చాలని పేర్కొన్నారు.

సన్మానం

బోథ్: బోథ్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని కొట్టాల పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన అల్లకొండ పోతన్న, ప్రధాన కార్యదర్శి సాయి గౌడ్, కోశాధికారి రమాకాంత్, ఉపాధ్యక్షుడు యాసిన్‌తో పాటు కమిటీ సభ్యులు, బోథ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అంజయ్యను సన్మానించారు.

'డిగ్రీ కళాశాలలను తగ్గిస్తే ఊరుకోం'

బోథ్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ డిగ్రీ కళాశాలలను తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తే ఊరుకోమని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ మహిళా డిగ్రీ కళాశాలను యాథావిధిగా కొనసాగించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ డిగ్రీ కళాశాలల్లో దోస్త్‌తో పాటు అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలన్నారు. ఎస్సీ కళాశాలలను తగ్గిస్తే జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు ఉన్నత చదువుకు దూరం కావాల్సి వస్తుందన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బోథ్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గ్రామానికి చెందిన మీర్ ఇర్షాద్ అలీ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఇచ్చోడ: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐజీడీ (ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్) డెవలప్‌మెంట్ జిల్లా కోఆర్డినేటర్ జాన్‌ఎడ్వర్డ్ భూమిపాక ప్రశాంత్ అన్నారు. గురువారం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ఆశ్వీరద్ స్మార్ట్ ఇండియా సహకారంతో పోషణ మేళా నిర్వహించారు. వైద్యాధికారి కిరణ్‌కుమార్, ప్రత్యేకాధికారి మల్లిక పాల్గొన్నారు.

చట్టబద్ధత కల్పించాలి

బోథ్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ బోథ్ నియోజకవర్గ కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు కుడాల స్వామి , మండలంలోని కుచులాపూర్ గ్రామ కమిటీ సభ్యులు బిక్క గంగయ్య ,బత్తిని అడెల్లి , ఎనగంటి రాజేందర్, బిక్క రమణయ్య, లక్ష్మణ్, వర్ల గంగయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బోథ్: సొనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, గ్రామస్తులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం నుంచి వచ్చినటువంటి నిధులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గణితంకు ప్రాధాన్యత

ఆదిలాబాద్‌టౌన్: నిత్యజీవితంలో గణితంకు ఎంతో ప్రాధాన్యత ఉందని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సంగీత అన్నారు. గురువారం కళాశాలలో 'పై' దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పై విలువ 3.4 కాబట్టి మార్చి 14న దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో గణిత విభాగం హెచ్‌వోడీ అరుణ్ కుమార్, లెక్చరర్లు శ్రావణి, జగ్‌రామ్ అంతర్వేది, రమాకాంత్ గౌడ్, సంతోష్ కుమార్, మంజుల, రవికిరణ్ పాల్గొన్నారు.

స్విమింగ్‌పూల్ నిర్వహణకు టెండర్లు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిణి స్టేడియంలో గల స్విమ్మింగ్‌పూల్ నిర్వహణకు సంబంధించిన టెండర్ల నిర్వహణకు బల్దియా అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 11నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేయవచ్చని మున్సిపల్ ఇంజనీర్ పేరిరాజు తెలిపారు. ఆఫ్‌లైన్‌లో మాత్రం 15వ తేదీ వరకు మాత్రమే టెండర్ దరఖాస్తులను విక్రయించనున్నట్లుగా పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాల కోసం నాన్ రిఫండబుల్ అమౌంట్‌గా రూ.5వేలు ఉంటుందన్నారు. టెండర్లను 20న సాయంత్రం 4గంటలకు తెరుస్తామని ఎవరు ఎక్కువ ధర కోట్ చేస్తే వారికే టెండర్‌ను అప్పగించనున్నట్లుగా పేర్కొన్నారు.

మార్కెట్‌లో హోలీ సందడి

వసంత రుతువు రంగుల పండుగను తీసుకువచ్చింది. కాముని పున్నమి తర్వాత హోలీ జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. శుక్రవారం హోలీ పండుగ కావడంతో వివిధ రకాల రంగులు, బొమ్మ గన్లు, మాస్కులు మార్కెట్‌లోకి వచ్చాయి. చిన్నారులు, యువతతో గురువారం జిల్లా కేంద్రంలోని దుకాణాలు సందడిగా మారాయి.

– ఆదిలాబాద్



సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు



రంగుల దుకాణం వద్ద రద్దీ

శానిటేషన్ వర్కర్ల వేతనాలు పెంచాలి



కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాల్గో తరగతి ఉద్యోగులు

కైలాస్‌నగర్: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న దినసరి, కంటిజెన్స్, ఎన్ఎంఆర్ పార్ట్‌టైమ్ శానిటేషన్ వర్కర్ల వేతనాలు పెంచాలని ప్రభుత్వ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కేబీసీ నారాయణ కోరారు. ఆ సంఘం నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పేద కుటుంబాలకు చెందిన కార్మికులకు చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎస్.శ్రీనివాస్, శౌకత్ హుస్సేన్, జైపాల్, వజీర్, మజీద్ ఖాన్, నర్సిములు, భీంబాయి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



పాఠశాల విద్యార్థులతో సబ్‌కలెక్టర్

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని గురువులు, తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం స్థానిక సరస్వతి జ్ఞాన విద్యాలయం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే (స్నాతకోత్సవ వేడుకలు) ఘనంగా నిర్వహించారు. సైన్స్, టెక్నాలజి మీద విద్యార్థులు నైపుణ్యం సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రవీణ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అజ్మత్ పాషా, మహేశ్, నజీమొద్దీన్, కపిల్‌రెడ్డి, అనిల్, పాఠశాల కరస్పాండెంట్ నాగన్న పాల్గొన్నారు.